క్లుప్తంగా

సకాలంలో రోడ్ల నిర్మాణం పూర్తి



కరకుదురులో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఈ

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని పెద్దాపురం డివిజన్ పంచాయతీరాజ్ డీఈ పీవీ రామకృష్ణయ్య తెలిపారు. మండలంలోని పెదపూడి, కరకుదురు, వేంద్ర, పైన గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.3.49 కోట్లతో సీసీ రోడ్ల పనులు చేపట్టామన్నారు. ప్రజల పర్యవేక్షణలో పనులు చేపట్టాలన్నారు. పనుల్లో నిబంధనలు పాటించాలన్నారు. ఆయన వెంట ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వెంకట్, మహేశ్వరి ఉన్నారు.

సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు

బిక్కవోలు: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులకు ఈ నెల 17, 18 తేదీల్లో శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద తొలి బ్యాచ్‌లో సర్పంచులు, మండల స్థాయి అధికారులు, 21 సచివాలయాల సిబ్బంది.100 మందికి, మండల వెలుగు కార్యాలయం వద్ద రెండో బ్యాచ్‌లో 93 మందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విజయ దుర్గాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు



రంగంపేటలో విజయ దుర్గాంబిక అమ్మవారు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో మంచినీటి చెరువు వద్ద కొలువైన విజయ దుర్గాంబిక ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నారాయణ ఆధ్వర్యంలో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అన్నసమారాధన



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

సీతానగరం: స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 4 వేల మంది భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. షష్ఠి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రజల సహాయ, సహకారాలతో ఈ కార్యక్రమం జరిగింది.

యువకుడిపై పోక్సో కేసు

సీతానగరం: బాలికను ఇంటి నుంచి తీసుకుపోయిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.రామ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. చినకొండేపూడికి చెందిన బాలికకు దగ్గర బంధువు అయిన దేవరపల్లి మండలం కృష్ణపాలేనికి చెందిన చాపల దుర్గాప్రసాద్‌తో పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో బాలికను ఇంటి నుంచి అతడు తీసుకపోయాడు. తన కుమార్తెకు మాయమాటలు చెప్పి దుర్గాప్రసాద్ కృష్ణపాలెం తీసుకువెళ్లాడని బాలిక తల్లి పోలీసులు ఫిర్యాదు చేసింది.

15న సత్యసాయి రుద్రాభిషేకం

రంగంపేట: భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా నిర్వహించే మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకానికి భక్తులు విజయవంతం చేయాలని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బలుసు వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం స్థానిక రాజుగారి రైస్‌మిల్లు ఆవరణలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15న స్థానిక రాజుగారి రైస్‌మిల్లు ఆవరణలో 106వ నమామి సాయి శత రుద్రీయం నిర్వహిస్తున్నామన్నారు.

15న వైద్య శిబిరం

పెదపూడి: జి.మామిడాడలో ఈ నెల 15న ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నల్లమిల్లి వెంకటరెడ్డి, భాస్కర లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లమిల్లి బుచ్చిరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం జి.మామిడాడలో మాట్లాడుతూ, స్థానిక ఆదిత్య స్కూల్ ఆవరణలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు శిబిరం నిర్వహిస్తారన్నారు. అనపర్తిలో సీడీఆర్ ఐవీఎఫ్, ల్యాప్రోస్కోప్ సెంటర్ వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. శిబిరంలో ఉచిత ఫర్టిలిటీ 3డీ స్కానింగ్ చేస్తారన్నారు. సంతానం లేని దంపతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పంటల బీమా.. రైతుకు దీమా

- బీమాకు ఈ నెలాఖరు వరకూ గడువు
- రైతులకు అధికారుల అవగాహన
- అన్నదాతలపై ప్రీమియం భారం
- జగన్ ప్రభుత్వంలో ఉచితంగా అందజేత



తుపాను కారణంగా కురిసిన వర్షాలకు మునిగిపోయిన పంటను చూపిస్తున్న రైతులు (ఫైల్)

రాజానగరం: నిరంతరం పొలంలో శ్రమిస్తూ, పంటలు పండించే అన్నదాతలకు పంటల బీమా కొండంత ధైర్యాన్ని ఇస్తుంది. అనుకోని నష్టం ఎదురైనప్పుడు అండగా ఉంటుంది. కానీ కొందరు రైతులు ఈ విషయాన్ని అంతగా పట్టించుకోరు. తాము సాగు చేసే పంటలకు బీమా చేయించడంలో శ్రద్ధ వహించరు. దీనితో ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఊహించని నష్టం ఏర్పడితే ఆదుకునే వారే ఉండరు.

పంట దెబ్బతింటే..

ప్రకృతి వైపరీత్యాలు సంభవించి, చేతికి అందివచ్చిన పంటలు దెబ్బతింటే ఆయా రైతులను ఆదుకునేందుకు పంటల బీమా తోడ్పడుతుంది. ముఖ్యంగా వరి పంటకు పంటల బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారులు పదే పదే చెబుతూ ఉన్నారు. పంటల బీమా చేయించుకునేందుకు ఈ నెలాఖరు వరకే సమయం ఉందని, సత్వరమే గడువులోగా బీమా ప్రీమియం చెల్లించాలని సూచిస్తున్నారు.

రైతులపై భారం

తమది నిజమైన రైతు రాజ్యమని, అన్నదాత సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామంటూ గొప్పలు చెప్పుకునే కూటమి పాలకులు.. పంటల బీమా ప్రీమియం భారాన్ని రైతుల పైనే వేయడం పలు విమర్శలకు తావిస్తోంది. నిన్నటి వరకు అధికారంలో ఉన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు పంటల బీమా ఉచితంగా అందిస్తూ వచ్చింది. బీమాకు అవసరమైన ప్రీమియం ఆయా రైతుల తరఫున ప్రభుత్వమే చెల్లించేది. దీనితో ప్రకృతి వైపరీత్యాలతో ఊహించని నష్టాలు ఏర్పడితే సత్వరమే పంటల బీమాను ఆయా రైతులకు అందించేలా చురుకైన పాత్ర పోషించేది.

కూటమి తీరు దారుణం

ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆ సంప్రదాయాన్ని వదిలేసింది. రైతులే ప్రీమియం చెల్లించుకోవాలని గడువు నిర్ణయించింది. దీంతో వారందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల తరఫున బీమా ప్రీమియం కూడా చెల్లించకపోవడం దారుణమన్నారు.

సాగు విస్తీర్ణం

రాజానగరం, అనపర్తి నియోజకవర్గాలలో 64,695 ఎకరాల ఖరీఫ్ పంటను సాగు చేశారు. రబీ సీజన్‌లో ఈ విస్తీర్ణం 47,295 ఎకరాల వరకు ఉండవచ్చు. పంటల బీమా ప్రీమియంగా ఎకరానికి రూ.630 చెల్లించాల్సి ఉంది. ఈ విధంగా వరి పంటను సాగు చేసే రైతులు రూ.2.98 కోట్ల వరకు కట్టాలి. దీనిని ప్రభుత్వమే భరించి, రైతుల ప్రభుత్వమనే నినాదాన్ని నిజం చేయాలని రైతులు కోరుతున్నారు.

పంటల బీమా తప్పనిసరి



పంటల బీమా ప్రీమియాన్ని ఈ నెలాఖరులోపు రైతులు చెల్లించాలి. ఎకరానికి రూ.630 చొప్పున సమీపంలోని బ్యాంకు, కామన్ సర్వీస్ సెంటర్, రైతు సేవాకేంద్రంలో చెల్లించి, నమోదు చేయించుకోవాలి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టం వాటిల్లితే పరిహారం పొందేందుకు పంటల బీమా తప్పనిసరి.

– షేక్ ఇమామి ఖాసిమ్, మండల వ్యవసాయాధికారి, రాజానగరం

ప్రభుత్వమే చెల్లించాలి



పంటల బీమాకు సంబంధించిన ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలి. నిన్నటి వరకు అధికారంలో ఉన్న జగనన్న సర్కారు ఈ ప్రీమియాన్ని చెల్లించి, రైతులకు భారం కాకుండా చూసింది. అదే బాటలో కూటమి ప్రభుత్వం కూడా పయనించాలి. రైతుల తరఫున కట్టి, వారి సంక్షేమానికి కృషి చేయాలి.

– పంపన శ్రీను, నందరాడ మాజీ సొసైటీ చైర్‌పర్సన్

ఇష్టపడి చదివితే మంచి ఫలితం

స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్జేడీ నాగమణి



పందలపాకలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ

బిక్కవోలు: ఇష్టపడి చదివితే ఫలితం ఉంటుందని స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్జేడీ ఎం నాగమణి అన్నారు. శుక్రవారం మండలంలోని పందలపాక గ్రామంలో పడాల పెద్ద పుల్లారెడ్డి జెడ్పీ హైస్కూల్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉన్నత, హైస్కూల్ ప్లస్ విద్యార్థులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివితే మంచి మార్కులు సాధించగలరన్నారు. భవిష్యత్తుకు తొలిమెట్టు పదో తరగతే అన్నారు. చదువుతో పాటు, ఆరోగ్యం కూడా అవసరమని, అందుకు నిత్యం 30 నిమిషాలు యోగా చేయాలన్నారు. ఆమె వెంట హెచ్ఎం చిర్ల వీర్రాఘవ రెడ్డి, అభివృద్ధి కమిటీ చైర్మన్ కొనాల సత్తిరాజు, పీడీ దార్వంపూడి యువరాజారెడ్డి ఉన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం



పందలపాకలో ఎన్నికల ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణ

బిక్కవోలు: నీటి సంఘాల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ బీవీవీఎస్ కృష్ణ శుక్రవారం తెలిపారు. శనివారం నీటి సంఘ ఎన్నికల నేపథ్యంలో పందలపాక ఎన్నికల కేంద్రమైన పందలపాక ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన రైతులకు అదే రోజు సూచించిన ప్రదేశాల్లో ఆయా టీసీలకు సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. బిక్కవోలు 12 టీసీగాను 3,353 ఓట్లు బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద, పందలపాక టీసీ 12 గాను 2,293 ఓట్లు పందలపాక ఉన్నత పాఠశాల వద్ద, బలభద్రపురం 12 టీసీ గాను 2,214 ఓట్లు బలభద్రపురం ఉన్నత పాఠశాల వద్ద, కొంకుదురు 12 టీసీగాను 4,299 కొంకుదురు ఉన్నత పాఠశాల వద్ద, కొమరిపాలెం 12 టీసీగాను 2,942 ఓట్లు కొమరిపాలెం పంచాయతీ కార్యాలయం, ఎంపీపీ పాఠశాల, సచివాలయం-2 వద్ద నిర్వహిస్తున్నామని వివరించారు. రామన్న చెరువు 6 టీసీ నుంచి 117 ఓట్లు ఇలపల్లి ఉన్నత పాఠశాల వద్ద, లింగాల చెరువు 6 టీసీ నుంచి 762 ఓట్లు బిక్కవోలు ఇంగ్లిష్ మీడియం పాఠశాల వద్ద ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు ఎన్నికలు

మధురపూడి: కోరుకొండ మండలంలోని 25 రైతు సంస్థల నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు కోరుకొండ తహసీల్దార్ సుస్వాగతం తెలిపారు. మండలంలోని పుష్కర, సూరంపాలెం ప్రాజెక్టులపై నాలుగు మేజర్, రెండు మీడియం, అలాగే మండలంలోని 19 చెరువులకు సంబంధించిన 19 సంఘాలు ఉన్నాయి. వీటికి శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఎన్నికలు జరుగుతాయి. ఉదయం 9.45 గంటలకు ముందే నామినేషన్ల ప్రక్రియ నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటలోపు 150 మంది టీసీఎంలు ఎన్నికవుతారు. వీరంతా 25 మంది సాగునీటి సంఘ అధ్యక్షులు, 25 మంది ఉపాధ్యక్షులను ఎంపిక చేసుకుంటారు.

ఘనంగా హనుమద్వ్రతం



సంపరలో ప్రత్యేకాలంకరణలో అభయాంజనేయస్వామి



ప్రత్యేకాలంకరణలో హనుమంతుడు



రంగంపేటలో ఆంజనేయస్వామి

పెదపూడి: సంపర గ్రామంలో అభయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద శుక్రవారం హనుమత్ వ్రత మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి 25 లీటర్ల పాలు, 25 లీటర్ల పెరుగుతో ప్రత్యేక అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, నాగవల్లి దళ సహిత, సిందూర అర్చనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

కన్నుల పండువగా..

బిక్కవోలు: గ్రామంలోని పంచాయతీ వీధిలో ఉన్న హనుమంతుడి ఆలయం వద్ద హనుమత్ వ్రతం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. అర్చకుడు సురేష్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారి మూల విరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వ్రతం నిర్వహించారు. గారెలతో స్వామివారి అలంకరణ చేశారు. ఈ సందర్భంగా అన్న సమారాధన జరిగింది.ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణ పాల్గొన్నారు.

నేడు తీర్థ మహోత్సవం

రంగంపేట: గ్రామంలో ఉన్న అభయ ఆంజనేయ స్వామి వారి వార్షిక తీర్థ మహోత్సవం శనివారం నిర్వహించడానికి ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శనివారం ఉదయం తీర్థపు బిందెతో స్వామివారికి అభిషేకాలు చేస్తారు. తమలపాకులు, సింధూరంతో పూజలు నిర్వహిస్తారు. రాత్రి తీర్థ మహోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా పోటీలు ఏర్పాటు చేశారు.



స్వామివారికి విభూది అభిషేకాలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో..

పెదపూడి: అనపర్తిలోని నల్లకాలువ ప్రాంతంలో ఉన్న ఆంజనేయస్వామికి హనుమద్వ్రతం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు నాగదేవర వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పలువురు పండితులు వేద మంత్రాలతో 36 రకాల ద్రవ్యాలతో సామూహిక సింధూర, తమలపాకులతో అర్చన, పంచామృతాభిషేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వెలవెలబోయిన రెవెన్యూ సదస్సు



కోటి గ్రామంలో అధికారులు లేక వెలవెలబోయిన సదస్సు

మధురపూడి: కోరుకొండ మండలం కోటి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సు రైతులకు ఉపయోగపడలేదు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మండలస్థాయి అధికారులు పూర్తి సమయాన్ని కేటాయించక పోవడంతో సదస్సు మధ్యాహ్నం నుంచి నిలిచిపోయింది. షెడ్యూల్ ప్రకారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిర్వహిస్తే రైతులు తమ భూమి సమస్యలను పరిష్కరించుకోవడానికి అవకాశం ఉండేది. స్థానిక వీఆర్వో దయాందస్వామి తప్ప రెవెన్యూ సిబ్బంది లేకపోవడంతో అసంపూర్తిగా నిలిచింది. కాగా.. ఈ విషయంపై తహసీల్దార్ సుస్వాగతాన్ని వివరణ కోరగా.. కోటిలో జరిగిన రెవెన్యూ సదస్సులో మధ్యాహ్నం వరకూ ఉన్నానని, అనంతరం రైతు సంఘాల ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించేందుకు వెళ్లినట్టు వివరించారు.

నాలుగు అర్జీలు

సీతానగరం: మండలంలోని మిర్తిపాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు నాలుగు అర్జీలు అందాయి. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు కావాలని మూడు, భూమి సర్వే నంబర్ సమస్యకు సంబంధించి ఒకరు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మూర్తి, ఆర్ఐ నవీన్, వీఆర్వో కుమారి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది, ఎండోమెంట్ అధికారులు, ఫారెస్ట్ అధికారులు, సచివాలయ సిబ్బంది, సర్వేయర్ పాల్గొన్నారు.



రామేశ్వరంలో రైతు నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్

భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు

పెదపూడి: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదం చేస్తాయని తహసీల్దార్ పీవీ సీతాపతిరావు అన్నారు. మండలంలోని రామేశ్వరం, వేంద్ర గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించి మార్పులు, భూముల కొలతల్లో వ్యత్యాసాలపై ఆన్‌లైన్‌లో రైతులు దరఖాస్తులు అందించి పరిష్కారం పొందాలన్నారు. రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో సుమారు 20 దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో రామేశ్వరం సర్పంచ్ కొటికలపూడి చినబాబు, వీఆర్వోలు కరెడ్ల రమేష్‌బాబు, లంక కుమార్, ఎంపీటీసీ సభ్యుడు ఎం.సూరిబాబు, రిటైర్డ్ తహసీల్దార్ కోలా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు సన్మానం



వంగలపూడి మసీదులో ముస్లింలకు సన్మానం

సీతానగరం: వంగలపూడి మసీదులో అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ జిల్లా అధ్యక్షుడు షేక్ సుల్తాన్, మాజీ అధ్యక్షుడు షేక్ నబీ, మహిళా జిల్లా అధ్యక్షురాలు సారాబీ, మౌల్వీ మహమ్మద్ అక్బర్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. వీరందరూ గత నెల 10న ఉమ్రా మక్కా యాత్రకు వెళ్లారు. వీరిని గ్రామ అధ్యక్షుడు షేక్ ఖాసీం ఫారూక్, సభ్యులు సన్మానించారు.

రాజానగరం మండల అధికారుల ఫోన్ నంబర్లు

ఎంపీడీఓ	ఎస్‌జే ఝాన్సీ	96520 77166
తహసీల్దార్	ఎన్.లక్ష్మీలావణ్య	98499 03900
డిప్యూటీ తహసీల్దార్	ఎ.కుమారి	99491 00395
మండల సర్వేయర్	ఇ.అనిత	81794 14568
మండల సివిల్ సప్లయిస్ డీటీ	గొలుగూరి బాపిరాజు	91823 02929
మండల రీసర్వే డీటీ	బి.క్రాంతి	7382 286190
మండల వ్యవసాయాధికారి	ఎస్‌కే ఇమామి ఖాసిం	83310 56550
మండల ఇంజినీర్	సంపత్ కుమార్	98661 35609
విద్యుత్ శాఖ ఇంజినీర్, రాజానగరం	సుధాకర్	94408 12623
విద్యుత్ శాఖ ఇంజినీర్, సంపత్ నగరం	సత్యప్రసాద్	94408 12627
మండల విద్యాశాఖాధికారి- 1	రామన్నదొర	94409 13928
మండల విద్యాశాఖాధికారి- 2	జ్యోతిప్రసాద్	94401 71896
ఐసీడీఎస్ ప్రాజెక్టు, సీడీపీఓ	టి.నాగమణి	94408 14693
ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ) ఏపీఎం	సునీత	79933 25065
గృహ నిర్మాణ శాఖ డీఈ	ఆర్‌వీ బాబు	70939 30566
గృహనిర్మాణ శాఖ ఏఈ	ఏవి రామారావు	70939 30478
సబ్ రిజిస్ట్రార్, రాజానగరం	వెంకటేశ్వరరావు	70939 21434
పోలీసు శాఖ		
రాజానగరం సీఐ	ఎస్‌పీ వీరయ్య గౌడ్	94407 96585
రాజానగరం ఎస్సై- 1	మనోహర్	94932 06031
ఎస్సై- 2	నాగేశ్వర్	94904 91132
బొమ్మూరు సీఐ	కాశీ విశ్వనాథ్	94407 96533

బిక్కవోలు మండలంలోని అధికారుల వివరాలు

పేరు	హోదా	ఫోన్ నంబర్
వి. శ్రీనువాస్	ఎంపీడీవో	9848496088
ఎస్.జాన్ మిల్టన్	పంచాయతీ విస్తరణాధికారి	9110394865
-	తహసీల్దార్	9849903913
బీబీఎస్‌వీవీ కృష్ణ	డిప్యూటీ తహసీల్దార్	9866484845
యువై రత్నం	అసిస్టెంట్ ఇంజినీర్, పంచాయతీరాజ్	7036977405
ఎస్ సామ్యూల్ జాన్	వ్యవసాయ శాఖ ఏవో	8331056572
సీహెచ్‌వీవీ సత్యనారాయణ	మండల విద్యాశాఖ-1	9394222224
కె.పూర్ణచంద్రరావు	మండల విద్యాశాఖ -2	7981174295
కె.సాయి కుమార్	ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్	9111199576
రాంబాబు	ఏఈ, రోడ్డు భవనాల శాఖ	6301327292
ఏ.సరోజి	ఏఈఈ, నీటి పారుదల శాఖ, బిక్కవోలు	9885133949
కె.బుజ్జిదొర	ఏఈ, విద్యుత్ శాఖ	9440812650
వి.వనమయ్య	ఏఈ, హౌసింగ్	7093930486
వి.రవిచంద్ర కుమార్	ఎస్సై	9440904851
డాక్టర్ ప్రణీత్	వెటర్నరీ వైద్యులు, బిక్కవోలు	9494240289
డాక్టర్ దుర్గాదేవి	పీహెచ్‌సీ వైద్యులు, బిక్కవోలు	8008540157
డాక్టర్ విజయలక్ష్మి	పీహెచ్‌సీ వైద్యులు, కొంకుదురు	6303221241
అగస్టీన్	ఏపీవో ఉపాధిహామీ	7093998252
టి.సుప్రియ	ఏపీఎం వెలుగు	7993325064
శాంతి	ఐసీడీఎస్ సూపర్‌వైజర్, బిక్కవోలు	9177060757
కృష్ణవేణి	ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఊలపల్లి సెక్టార్	6305213882
జెర్సీ ఫోరెన్స్	ఐసీడీఎస్ సీడీపీవో, రంగంపేట ప్రాజెక్టు	9491051561
ఎస్.ప్రభు కృష్ణ,	ఏఎస్ఓ	9493789131

15న మాలల మహాగర్జన సభ

రాజానగరం: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 15న గుంటూరులో మాలల మహాగర్జన సభ నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా కో కన్వీనర్ మేకల లక్ష్మీపతిరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు, క్రిమిలేయర్‌కు సుప్రీంకోర్టు అనుకూల తీర్పునిచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. మాలలను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుంటున్న పాలకులకు గుణపాఠం చెప్పాలన్నారు. దానిలో భాగంగా ఎస్సీ సామాజిక వర్గీయులు భారీగా సభకు తరలివచ్చి, నిరసన గళం వినిపించాలన్నారు.

మంచి ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న ప్రిన్సిపాల్

రంగంపేట: వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.హేమ అన్నారు. సంకల్ప్-2025 కార్యక్రమంలో భాగంగా ఇంటర్మీడియెట్ ఫస్ట్, సెకండియర్ విద్యార్థులకు ఇంటర్మీడియెట్ బోర్డు అందించిన స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం ఆమె పంపిణీ చేశారు. స్టడీ మెటీరియల్‌ను బాగా అభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అధ్యాపకులు పి.కృష్ణమూర్తి, ఈ.శేఖర్‌బాబు, కేవీ కృష్ణ, శ్యామలరావు పాల్గొన్నారు.

రూ.17.40 లక్షల విలువైన ఎరువులు సీజ్

సీతానగరం: రఘుదేవపురంలోని రెండు ఎరువుల షాపులపై శుక్రవారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేశారు. ఈ సందర్భంగా రూ.17.40 లక్షల విలువైన 1,535 ఎరువుల బస్తాలను సీజ్ చేశారు. గ్రామంలోని లక్ష్మీ వెంకటేశ్వర జనరల్ స్టోర్స్ అండ్ ఫెర్టిలైజర్స్, వెంకట మోహన్ ట్రేడర్స్ ఎరువుల షాపులలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ స్నేహిత, డీసీటీవో నవీన్ కుమార్, సీఐ మధుబాబు తదితరులు తనిఖీలు చేశారు. స్టాక్, బిల్లులు, రిజిస్టర్లలో వ్యత్యాసాలను గుర్తించారు. అనంతరం ఇన్‌చార్జి ఏవో రామ తులసి విలేకరులతో మాట్లాడుతూ లక్ష్మీ వెంకటేశ్వర జనరల్ స్టోర్స్ అండ్ ఫెర్టిలైజర్స్ షాపులో రూ.8,30,663 విలువైన 772 ఎరువుల బస్తాలు, వెంకట మోహన్ ట్రేడర్స్‌లో రూ 9,10,200 విలువైన 763 బస్తాలను సీజ్ చేసినట్టు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది శివ, రవితేజ తదితరులు పాల్గొన్నారు.